క్లుప్తంగా


విద్యార్థులకు బహుమతుల ప్రదానం



నగరం: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని ఎస్వీఆర్ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో ఇటీవల జరిగిన టాలెంట్ టెస్ట్ విజేతలకు సోమవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు ఏటా కళాశాలలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శశి వర్ధన్, సాత్విక, ధాత్రిలకు రూ.5, 3, 2 వేల ప్రోత్సాహక నగదు, షీల్డ్‌లను అందజేశారు. అదేవిధంగా 20 మందికి కన్సోలేషన్ రూ.500లు లెక్కన నగదు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని కొండుబొట్ల పాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బుక్ లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారని తెలిపారు. దేశం మొత్తం గుర్తించే విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వార సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం వైస్ జగన్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలను వందశాతం అమలు చేశామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవ రెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డీ ముక్కల డేవిడ్, ఎంపీడీఓ రాధాకృష్ణ, బాపట్ల రూరల్ ఎస్సై వెంకటప్రసాద్, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రికవరీ' చేయాల్సింది ఎవరి నుంచి..?

బ్యాంకు మేనేజర్ తీరుపై డ్వాక్రా మహిళల ఆగ్రహం



ఎస్ఐతో మాట్లాడుతున్న పెదగొల్లపాలెం మహిళలు

కర్లపాలెం: బ్యాంకు మిత్ర నగదు స్వాహా చేసిన ఘటనలో యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ తీరుపై పెదగొల్లపాలెం డ్వాక్రా మహిళలు సోమవారం కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్యకు ఫిర్యాదు చేశారు. పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన బ్యాంకు మిత్ర.. తమ రుణాల కోసం జమ చేసిన నగదు స్వాహా చేసిందని, దీనిపై మూడు నెలల క్రితం పోలీసులకు, యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు డ్వాక్రా మహిళలు తెలిపారు. అయినా.. ఇంత వరకు బ్యాంకు మిత్ర స్వాహా చేసిన నగదు రికవరీ చేయకుండా.. మిగతా రుణ నగదు ఎందుకు చెల్లించడం లేదంటూ యూనియన్ బ్యాంకు మేనేజర్ తమకు నోటీసులు ఇచ్చి, ఇబ్బంది పెడుతున్నారని ఎస్ఐకి తెలిపారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ కేశవ నారాయణ రావుకు అర్జీ ఇచ్చారు. ఈ విషయమై కర్లపాలెం ఎస్ఐను వివరణ కోరగా.. మహిళలు సమస్యను వివరించారని, అయితే వారు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు.

పిల్లిని చూసి.. పులి అనుకొని..

- సూర్యలంకలో చిరుతపులి సంచారం అంటూ హడల్
- చిరుతలు తిరిగే ప్రసక్తే లేదంటున్న అటవీ అధికారులు



అటవీ అధికారులు విడుదల చేసిన సూర్యలంక తీరంలో అడవి పిల్లి చిత్రం

బాపట్లటౌన్: సూర్యలంక తీరంలో చిరుత పులి సంచరిస్తుందంటూ వచ్చిన పుకార్లు చక్కర్లు కొట్టాయి. మండలంలోని సూర్యలంక సమీపంలో గత శనివారం రాత్రి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చెందిన ఉద్యోగి విధులకు వెళ్తుండగా బాపట్ల–సూర్యలంక రోడ్డుపై చిరుతను పోలిన జంతువు కనిపించింది. ఈ విషయాన్ని సదరు ఉద్యోగి ఎయిర్‌ఫోర్స్ అధికారులకు చెప్పడంతో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో మైక్ అనౌన్స్‌మెంట్ చేసి ఉద్యోగులు, గృహాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఇద్దరు మహిళలకు చిరతను పోలిన జంతువు కనిపించడంతో అప్పటికే భయంతో వణికిపోతున్న మహిళలు చిరుతపులి అంటూ కేకలు వేశారు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారులు సోమవారం సూర్యలంక తీరంలో పులి కోసం జల్లెడ పట్టారు.

చిరుత సంచారంపై.. జిల్లా ఫారెస్ట్ అధికారి ఎల్. భీమయ్య స్పందించారు. జిల్లాలోని అటవీ సిబ్బందిని బృందాలుగా విభజించి ఎయిర్ ఫోర్స్ స్టేషన్, సూర్యలంక తీరంలోని అటవీ ప్రాంతాల్లో పర్యటించామన్నారు. ఎక్కడా కూడా చిరుతపులి సంచరించిన అనవాళ్లు లభించలేదన్నారు. సూర్యలంక తీరానికి చిరుత పులులు వచ్చే అస్కారం లేదని స్పష్టం చేశారు. సముద్ర తీరం వెంబడి ఉన్న సూర్యలంక అటవీ ప్రాంతం ఎక్కడా అభయారణ్యం అడవులకు అనుసంధానం కాదన్నారు. పెద్దసైజు కలిగిన అడవి పిల్లులు, నీటి పిల్లులు చిరుత పులిని పోలి ఉంటాయని, వాటిని చూసి ఎయిర్ ఫోర్స్ సిబ్బంది భయభ్రాంతులకు గురై ఉంటారని తెలిపారు. వాటి వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

భట్టిప్రోలు: మండలంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు సచివాలయాల పరిధిలో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఐలవరం, పెదపులివర్రు, బుధవారం పల్లెకోన, గొరిగపూడి, గురువారం కోనేటిపురం, పెదలంక, శుక్రవారం సూరేపల్లి, ఓలేరు గ్రామాల్లో క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దేవస్థానానికి రూ.లక్ష విరాళం



దేవస్థానం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రహీంరెడ్డి

బాపట్ల అర్బన్: మండలంలోని బేతపూడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అంకమ్మ తల్లి దేవస్థానానికి ఎస్ఐ కోట రహీం రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. పేదలకు లేదనకుండా సాయం చేస్తున్న ఆయనను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా రహీంరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట చిన్న మీరా రెడ్డి, కోట మల్లికార్జున్ రెడ్డి, కోట వెంకీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కోట రామకష్టారెడ్డి, పెద్ద సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం మృతికి ఎమ్మెల్యే సంతాపం

బాపట్ల అర్బన్: మండలంలోని చుండూరుపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత కండక్టర్, ఏఈఎల్సీ బోడిపాలెం ప్యారిస్ డెలిగేట్ బొడ్డు ఆశీర్వాదం సంతాప సభ సోమవారం జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆశీర్వాదం చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఒడిముక్కల డేవిడ్, బొడ్డు ప్రకాశం, రాజు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాపర్ల నరేంద్ర

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర పేర్కొన్నారు. అమర్తలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. మండలంలోని అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. వేసవిలో మంచి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు జగనన్న కాలనీలో గృహ నిర్మాణానికి పూర్తి బాధ్యత వహించాలని ఆయన చెప్పారు. వైస్ ఎంపీపీ కూచిపూడి శ్రీనివాసరరావు, ఎంపీటీసీలు కమ్మ వెంకట రెడ్డి, రాపర్ల వల్లీరాణి, కాకర్లమూడి అనూషా, పెదపూడి ప్రవీణ్, మానుకొండ ఝాన్సీ, కొడాలి సుబ్బారావు, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, తహసీల్దారు మోహర్ కుమార్ పాల్గొన్నారు.

లంపి స్కిన్ వ్యాధి లక్షణాలను గుర్తించాలి

నిజాంపట్నం: ఆవుల చర్మంపై మచ్చలు, బొబ్బలు వస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలని కూచినపూడి పశువైద్యశాల వైద్యులు హేమప్రియ తెలిపారు. సోమవారం పశువైద్యశాలలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఇటీవల ఆవుల్లో కనిపిస్తున్న ప్రాణాంతక ఎల్ఎస్‌డీ(లంపి స్కిన్ డిసీజ్)వ్యాధి పట్ల పశు పోషకులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ముందుగా గుర్తించి, చికిత్స అందిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. వ్యాధి సోకిన ఆవుల్లో రెండు రోజుల ముందు నుంచే మేత తీసుకోకపోవడం, జ్వరం, కాళ్లు, మెడ వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఇప్పటి వరకూ ముందస్తుగా గుర్తించిన సుమారు 50 ఆవులకు చికిత్స అందించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: పట్టణంలోని అరవపల్లి మురుగు కాల్వ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మృతుడు ఊలుపాలెం గ్రామానికి చెందిన రావుల సామియేలు(31)గా పోలీసులు గుర్తించారు. ఎస్ఐ భరత్‌కుమార్ వివరాల మేరకు.. సామియేలుకు రేపల్లె పట్టణంలోని 7వ వార్డుకు చెందిన లావణ్యతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వారు ఆ వార్డులోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఉదయం అరవపల్లి మురుగు కాల్వగట్టు పక్కన ఉన్న గుడిసె వద్ద అతను అనుమానస్పద స్థితిలో మృతి చెంది పడిఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి భిక్షాలు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్యగా.. అతని బంధువులు ఆరోపిస్తున్నారు.

'స్పందన'కు 7 అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం ఏడు అర్జీలు అందాయని తెలిపారు. నివేశన స్థలానికి 3, సర్వేకు 1, పట్టాదారు పాసు బుక్‌కు 1, కొళాయి కనెక్షన్‌కు 1, సమాచారం అందించాలని 1 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. సమస్యలను పరిశీలించి, పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

అంతరిక్ష ప్రయోగశాలపై ఆన్‌లైన్ చర్చ..

నగరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని పెద్దవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం అమెరికాకు చెందిన నాసా మాజీ డిప్యూటీ డైరెక్టర్ జిమ్ ఆడమ్స్ నిర్వహించిన ఆన్‌లైన్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగశాలకు సంబంధించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జిమ్ ఆడమ్స్ చక్కని వీడియోలతో వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంఈఓ కె. శ్రీనివాస్, ఉపాధ్యాయులు హరికృష్ణ, వెంకటేశ్వరావు, రమేష్ పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఎరువులు పుష్కలం

రేపల్లె రూరల్: రబీ సీజన్‌కు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వీఏఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతులు ఎరువుల కోసం వచ్చినప్పుడు రైతు భరోసా కేంద్ర అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. నెలాఖరు వరకు ఎరువులను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా రబీ పంటల వివరాలను ఈ–పంటలో, ఈకేవైసీలో తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాన కల్పించాలని నిర్దేశించారు.

భోజనం బాగుంది..

ఓలేరు(భట్టిప్రోలు): మండలంలోని ఓలేరు పంచాయతీ వెంకట్రాజునగర్ ఎంపీపీ పాఠశాలలో సోమవారం ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. వీరితోపాటు సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సీలా సాంబమ్మ భోజనం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను వారు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత, జూనియర్ అసిస్టెంట్ బుస్సా వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా

బాపట్ల అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని బాపట్లలో అంగన్‌వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా రోడ్డు మీద బైఠాయించారు. టీఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వారి సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ దృష్టికి తమ తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మధు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మండలాల్, జిల్లా నాయకులు పి.తిరుమలరెడ్డి, పి.ప్రతాప్ కుమార్, బి.హనుమంతరావు, సుధాకర్ శరత్, డేవిడ్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ చమక్కులు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు శ్యామ్‌సుందరరావు

బాపట్లటౌన్: సామాజిక మాధ్యమాల్లో ఫేస్‌బుక్ ప్రత్యేకమైనదని విశ్రాంత ఉపాధ్యాయుడు పి. శ్యామ్ సుందరరావు తెలిపారు. సోమవారం భావపురి విద్యా సంస్థల ప్రాంగణంలో బాపట్ల జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అద్దేపల్లి భరత్‌కుమార్ రచించిన ఫేస్‌బుక్ చమక్కులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్యామ్‌సుందరరావు మాట్లాడతూ.. రచయితగా సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంలో స్వీయ రచనల ద్వారా చివరి దాకా కృషి చేస్తానని చెప్పారు. ఫేస్‌బుక్‌లోని అభిప్రాయాలు ప్రజలపై ప్రభావాన్ని చూపుతాయని, సామాజిక మాధ్యమంలో రచనలు పోస్టు చేసేవారు బాధ్యత వహించాలన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు సజ్జ వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవప్రసాద్, సయ్యద్ జానీ బాషా, షేక్ బాబావలి, జీవీ మస్తాన్‌వలి, పోలాసం ఆంజనేయులు, ప్రత్తిపాటి సుభాషిణి, ఆవల వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ వర్మ, డా, మేకల రాజు, బందాబాబు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం.. అందరికీ సంక్షేమం

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మోపర్రులో మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి నాగార్జున

మోపర్రు(వేమూరు): అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు, అబ్బనగుంటపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచితంగా డబ్బులేస్తున్నారని..ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ప్రచారం చేస్తున్నారని, 14ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన ఇలాంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం

బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్(బౌడ) అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మంత్రితో పాటు గడప గడపకు పర్యటించారు. తన పదవికి కృషి చేసిన మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కొన రఘుపతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, సర్పంచ్ కొండపల్లి కిరణ్‌బాబు, మోపర్రు హరిబాబు, గర్నెపూడి అజయ్, మన్నవ శాంతి శ్రీ, కొండపల్లి వినయ్, కొత్తపల్లి శేషయ్య, షేక్ వల్లీ, కాకర్లమూడి భాస్కర్, కాకిత సందీప్, కొండపల్లి వెంకట్, చక్రవర్తి గోవిందరాజు, జి.రామకృష్ణ, మామిడిపల్లి బాలు, గోవతోటి ఏసోబు, మోదుకూరి ముత్యాలు, కొండపల్లి కొర్నియేలు, సోమిశెట్టి నాంచారయ్య, జాలాది కిష్టయ్య, చిక్కాల ఏసురత్నం, చల్లపల్లి అనిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.